జోడేఘాట్‌కు పర్యాటకుల సందడి

భీం విగ్రహం వద్ద ఆదిలాబాద్ జిల్లా పర్యాటకులు

కెరమెరి, అక్టోబర్ 18 : జోడేఘాట్‌కు పర్యాటకుల తాకిడి మొదలైంది. దసరా సెలవులు కావడంతో ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. సీఎం కేసీఆర్ కుమ్రం భీం పోరుగడ్డను స్వరాష్ట్రంలో సుందరంగా తీర్చిదిద్దారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లికి చెందిన యువకులు జోడేఘాట్‌కు చేరుకొని భీం విగ్రహం, మ్యూజియం పరిశీలించారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి

కౌటాల, అక్టోబర్ 18 : మండలంలోని రైతులు తప్పకుండా ఈ-కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పాలకుర్తి రాజేశ్ సూచించారు. మండలంలోని విర్దండి గ్రామంలో బుధవారం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ఫేస్ ఆర్‌డీ అప్లికేషన్ ద్వారా రైతుల వివరాలను తీసుకున్నారు. ఈ-కేవైసీలో బయోమెట్రిక్ లేదా ఓటీపీ ద్వారానే కాకుండా ప్రస్తుతం ఫేస్ ఆర్‌డీ అప్లికేషన్ ద్వారా కూడా రైతుల వివరాలను నమోదు చేయవచ్చని తెలిపారు. మండలంలో రైతులకు అందుబాటులో కావాల్సినంత యూరియా నిల్వలున్నాయని తెలిపారు. ఆయన వెంట ఏఈవో కల్పన, రైతులు ఉన్నారు.

సోయా పంట కోత ప్రయోగం

కౌటాల, అక్టోబర్ 18 : మండలంలోని తుమ్డిహట్టి గ్రామంలో బుధవారం మండల వ్యవసాయాధికారి పాలకుర్తి రాజేశ్, ఏఈవో చౌదరి అంజన్నతో కలిసి సోయా పంటలో కోత ప్రయోగం నిర్వహించారు. వ్యవసాయ భూమిలో 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పుతో పంట కోత ప్రయోగం చేసినట్లు వారు తెలిపారు. ఇందులో 3.5 కిలోల దిగుబడి వచ్చినట్లు వారు పేర్కొన్నారు. వివరాలను నమోదు చేసి, వాటి పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు వారు తెలిపారు. వారి వెంట రైతులు తిరుపతి, విలాస్ తదితరులు ఉన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కాగజ్‌నగర్, అక్టోబర్ 18 : విద్యుత్ వినియోగాదారులు డిజిటల్ చెల్లింపులను సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ తుకారాం, ఏడీఈ శ్రీనివాస్ సూచించారు. కాగజ్‌నగర్ పట్టణంలో బుధవారం డిజిటల్ చెల్లింపులపై విద్యుత్ వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈ కమాలాకర్, ఫోర్‌మన్ భూమయ్య, సిబ్బంది మురళీధర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు

దహెగాం, అక్టోబర్ 18 : వర్షం కురువాలని కోరుతూ మండలంలోని కోత్మీర్‌లో గ్రామస్తులు గ్రామ దేవతలకు పూజలు చేశారు. లక్ష్మీదేవర, పాండవ దేవతలను ఊరేగించడంతో పాటు, పోశమ్మకు పూజలు నిర్వహించారు. కొద్ది రోజులుగా వర్షం పడకపోవడంతో పత్తి, తదితర పంటలు ఎండిపోతున్నాయని దేవతలను వేడుకున్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

రెబ్బెన, అక్టోబర్ 18 : రెబ్బెన మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో జరిగిన కరాటే మండలస్థాయి పోటీల్లో ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు దివ్య, వినయ్, రవి, నవీన్ ప్రతిభ చూపిట్లు కరాటే మాస్టర్ చాపిడి కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరు ఎల్లో బెల్ట్ సాధించారని పేర్కొన్నారు. డ్రాగన్ కుంగ్ పూ క్లబ్ ఆధ్వర్యంలో వీరికి మూడు నెలలు శిక్షణ అందించిట్లు ఆయన వెల్లడించారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన ఉండాలి

■ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

ఆసిఫాబాద్, అక్టోబర్ 18 : ఎన్నికల నిర్వహణలో భాగంగా సెక్టోరల్ అధికారులు ఈవీఎం, వీవీ ప్యాట్లు, హ్యాండ్ బుక్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి ఆసిఫాబాద్ నియోజకవర్గ సెక్టోరల్ అధికారులతో ఈవీఎం, వీవీ ప్యాట్లు, హ్యాండ్ బుక్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికలు సజావుగా సాగడంలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమైనదన్నారు. సెక్టోరల్ అధికారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలోల వసతులు, ర్యాంపులు, నీటి వసతి, ఫర్నిచర్, విద్యుత్, ఫ్యాన్లు, పోలింగ్ కేంద్రంలో మరమ్మతులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని, వసతులను పరిశీలించి సంబంధిత ఫార్మాట్‌లో వివరాలను సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికలు జరిగే వారం ముందు నుంచి సెక్టోరల్ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ సిబ్బందిని తీసుకెళ్లి తిరిగి తీసుకురావడం, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా

మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ సహదేవరావు

చర్యలు తీసుకోవడం, పోలింగ్ కేంద్రాలోల నెలకొన్న సమస్యలపై ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలన్నారు. రిజర్వ్ ఈవీఎం అందుబాటులో ఉంచుకోవడం, ఎన్నికల రోజున కేటాయించిన రూట్ పరిధిలో శాంతిభద్రతలకు ఇబ్బంది లేకుండా తహసీల్దార్లు, పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ప్రతీ పోలింగ్ కేంద్రంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో మాస్టర్ ట్రైనర్లు, సెక్టార్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలి

ఆసిఫాబాద్, అక్టోబర్ 18 : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని ఎస్పీ సురేశ్ కుమార్ పేర్కొన్నారు. పెండింగ్ కేసులు, నాన్ వెయిలబుల్ వారెంట్లు, ఎన్నికల నిర్వహణపై బుధవారం పోలీసు అధికారులతో సమీక్షించారు. చెక్ పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రజలను ప్రభావితం చేసేందుకు డబ్బు, మద్యం ఇతర సామగ్రి జిల్లాలోనికి ప్రవేశించకుండా చెక్ పోస్టుల ద్వారా వివిధ శాఖల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.

మాట్లాడుతున్న ఎస్పీ

పెండింగ్ (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసుల్లో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డీఎస్పీలు వెంకటరమణ, కరుణాకర్, ఎస్బీ సీఐ రాణా ప్రతాప్, డీసీఆర్‌బీ సీఐ రమేశ్, సీసీఎస్ సీఐ ముత్యం రాజు, జిల్లాలోని సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, డీపీవో శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది, ఐటీ కోర్, డీసీఆర్‌బీ సిబ్బంది పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు

రెబ్బెన, అక్టోబర్ 18 : రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. విద్యార్థులు, లెక్చరర్లు బతుకమ్మలను పేర్చి, అడిపాడారు. ముఖ్య అతిథిగా డీఐఈవో, జిల్లా నోడల్ అధికారి శంకర్ హాజరయ్యారు. విద్యార్థులతో కలిసి, బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీశ్, లెక్చరర్లు శ్రీనివాస్, గంగాధర్, ప్రకాశ్, ప్రవీణ్, వెంకటేశ్, కృష్ణమూర్తి, కుశిల్, సుమలత, దీప్తి, నిర్మల, జాన్సీ, ఏకలవ్య, మంజుల, వెంకటేశ్వరి, సంధ్య, మల్లీశ్వరి, సౌమ్య పాల్గొన్నారు.

బెజ్జూర్ కళాశాలలో..

బెజ్జూర్, అక్టోబర్ 18 : బెజ్జూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రాజయ్య ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెబ్బెన కళాశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు, అధ్యాపకులు

వాంకిడి కళాశాలలో..

వాంకిడి, అక్టోబర్ 18 : వాంకిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులు, సిబ్బంది బతుకమ్మ ఆడిపడారు. కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఆసిఫాబాద్, అక్టోబర్ 18 : దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా శారదాదేవి, దుర్గామాత మండపాల వద్ద బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాపునగర్ శారదా గణేశ్ మండలి, పైకాజీనగర్ బాలగణేశ్ మండలి వద్ద నాల్గో రోజు అమ్మవారు శాఖాంబరి అవతారంలో భక్తులకు దర్శనమిచారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శిశుమందిర్‌లో అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమలలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు గాదెవేణి మల్లేశ్, చిలువేరు వెంకటేశ్వర్లు, మండలి కమిటీ అధ్యక్షుడు పుల్లూరు రవి, సభ్యులు గీత, అశ్విన్, మంగ, విలాస్, వివేక్, శ్రీనివాస్, రజిని, మహేందర్, శిరీష, ఆనంద్, శ్రీనివాస్ గౌడ్, నవీన్, సుబ్బారెడ్డి, సాయి, మహిళలు పాల్గొన్నారు.

రెబ్బెన, అక్టోబర్ 18 : రెబ్బెన మండలం ఇందిరానగర్‌లో కొలువైన శ్రీ కనకదుర్గాదేవి స్వయంభూ మహంకాళీ ఆలయంలో బుధవారం దుర్గమ్మతల్లి మహాలక్ష్మీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. కాగా, భక్తులు పూజలు చేశారు. అర్చకుడు దేవర వినోద్ భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆయా గ్రామాల్లో కొలువైన అమ్మవార్లకు ఉదయం, సాయంత్రం భక్తులు విశేష పూజలు నిర్వహిస్తున్నారు.

ఆసిఫాబాద్ : శాఖాంబరి అవతారంలో అమ్మవారు

దహెగాం, అక్టోబర్18 : దహెగాంలో దుర్గాదేవి అమ్మవారు అన్నపూర్ణా దేవిగా భక్తులకు దర్శనమిచారు. మండల కేంద్రం, పాటు బీబ్రా తదితర గ్రామాల్లో భకుతలు ప్రత్యేక పూజలు చేశారు. మంపాల వద్ద భక్తులకు అన్నదానాలు చేశారు.

గంజాయి మొక్కలు ధ్వంసం

గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న అధికారులు

జైనూర్, అక్టోబర్ 18 : జైనూర్ మండలం బాజీరావుగూడ, బూసి మేట క్యాంప్‌లో పెద్ద ఎత్తున గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సందీప్ కుమార్ తెలిపారు. ధ్వంసం చేసి, రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు వివరించారు. బాజీరావుగూడాకి చెందిన రైతు సోమాసే లక్ష్మణ్ చేనులో 48, బూసి మేట క్యాంప్‌లో రైతులు మనోహర్ సర్కుండే, జ్ఞానేశ్వర్ చేను వద్ద 370 గంజాయి మొక్కలను పట్టుకొని, ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాలను ఉత్పత్తి చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టుకున్న మొత్తం 418 మొక్కలను ధ్వంసం చేసి, రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు చెప్పారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

మందుల పంపిణీ

పీహెచ్‌సీలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

చింతలమానేపల్లి, అక్టోబర్ 18 : ఎల్‌సీడీసీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రవీంద్రనగర్-1, గంగాపూర్, బాబాపూర్ పీహెచ్‌సీ పరిధిలోని ఆయా గ్రామాల్లో డాక్టర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆగస్టు 16 నుంచి 31 వరకు వైద్య బృందం సర్వే నిర్వహించి, 58 మందిని కుష్ఠు అనుమానితులుగా గుర్తించారు. కాగా బుధవారం గంగాపూర్, బాబాపూర్ పీహెచ్‌సీలో లెప్రసొసైటీ ఆధ్వర్యంలో డాక్టర్ ధీరజ్‌తో పాటు సొసైటీ ఇన్‌చార్జి రాజేందర్ పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ ఇందిరాగాంధీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అవగాహన ఉండాలి

ఆసిఫాబాద్, అక్టోబర్ 18 : దేశ గొప్పతనంపై ప్రతీ ఒక్కరికీ అవగాహన ఉండాలని తెలంగాణ ప్రాంత సేవా ప్రముఖ్ శివశంకర్ అన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ మంచిర్యాల జిల్లా అధ్వర్యంలో (ప్రాథమిక శిక్షావర్గ) వ్యక్తిత్వ వికాస శిబిరాన్ని ఆసిఫాబాద్‌లో గల శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విభాగ్ సహకార్యవాహక్ గోన భూమయ్య, జిల్లా సహ కార్యవాహక్ మోర్ల మధూకర్, విభాగ్ సేవా ప్రముఖ్ రంగస్వామి, కోటేశ్వర్, వేణుగోపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి జైలు..

కౌటాల, అక్టోబర్ 18 : కౌటాల పోలీస్ స్టేషన్ పరిధిలోని కౌటి గ్రామానికి చెందిన బోర్కుట్ వినోద్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ ప్రత్యేక జడ్జి ఎంవీ రమేశ్ బుధవారం తీర్పునిచ్చారని ఎస్ఐ మధూకర్ తెలిపారు. వినోద్ గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు, ఇద్దరు బాలికలు వారివారి ఇండ్లలో స్నానాలు చేస్తుండగా, వీడియోలు, ఫొటోలు తీశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు అతనిపై 2018లో ఎస్సీ ఫోక్సో కేసు నమోదైంది. బుధవారం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీవీఎస్ ప్రసాద్, అదనపు ఎస్పీ ఎస్ అచ్చేశ్వర్ రావు కేసును చార్జిషీట్ వేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు ఎవరు చేసినా సహించేంది లేదని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.